

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## పూజకి వేళాయరా!

**ఉసూరుమంటూ** ఇంట్లోకి అడుగుపెట్టాడు సీతాపతి.

"కనకా! కనకా!" నీరసంగా పిలిచాడు.

"వస్తున్నా ఒక్క నిమిషం" మంచినీళ్ళ గ్లాస్‌తో వచ్చింది కనకదుర్గ.

"విపరీతంగా ఆకలేస్తోంది, ఏమైనా పెట్టు కనకా" నీళ్ళు తాగి అడిగాడు.

"అయ్యో! ఎవరో నందికేశుడి నోము నోస్తున్నారు రమ్మని పక్కింటావిడ తీసుకెళితే వెళ్ళి పులిహోర, దద్దోజనం తిని వచ్చానండీ. వచ్చి ఐదు నిమిషాలైంది. ఇంట్లో ఏమీ వండలేదు" చెప్పింది.

ఆమె నుదుటి మీది కుంకుమ బొట్టుని, కట్టుకున్న పాత పట్టుచీరని చూసి ఏమనాలో తోచలేదు సీతాపతికి.

"ఈ షుగర్ వచ్చినప్పటినుంచీ ఆకలికి ఆగలేక పోతున్నాను కనకా. ఆఫీసయ్యాక బయట ఏదైనా తినివస్తే తిడతావు. 'చేసినవన్నీ వృధా! ఉన్నది ఇద్దరం మీ వంతు మీరు తినకపోతే ఎట్లా' అని గొడవచేస్తావు. మరి ఇంట్లో ఏమీ లేనప్పుడు బయట తిని రమ్మని ఫోన్ చేయచ్చుగా?" కోపంగా అడిగాడు.

"అయ్యో! తట్టలేదండి. పోనీ ఈ రెండు అరటి పళ్ళు తినండి. ఈలోగా ఇడ్లీ వేస్తా" తాంబూలంలో ఇచ్చిన అరటిపళ్ళు అందించింది.

"షుగర్ వాళ్ళు అరటిపళ్ళు తినకూడదే" నిస్సహాయంగా చెప్పాడు.

"ఒక్కసారికి ఫర్వాలేదులెండి. తినండి."

వాటిని అతని చేతిలో పెట్టి వంటగదిలోకి నడిచింది. పావుగంట తర్వాత తన ముందు పెట్టిన ఇడ్లీప్లేట్‌ని చూసి నీర్సంగా మూలిగాడు సీతాపతి.

"ఏదైనా చట్నీ చేయొచ్చుగా. ఆవకాయ పచ్చడితో ఇడ్లీ తినలేం కనకా!"

"అబ్బా! పొట్ట నిండుగా ఉండి పని చెయ్యబుద్ధికావడంలేదు. ఈ ఒక్కసారికి సర్దుకోండి. ప్లేట్ నిండుగా పెట్టారు వాళ్ళు. వదిలేయకూడదట. తినలేక చచ్చాననుకోండి" ఇడ్లీ మీద నెయ్యి వేస్తూ చెప్పింది కనకదుర్గ.

"పుండు మీద కారం చల్లడం అంటే ఇదే" రహస్యంగా పళ్ళునూరుకున్నాడు సీతాపతి.

"ఏవండీ చిక్కడపల్లిలోని రామలక్ష్మిగారింట్లో లలితా సహస్రనామానికి వెళ్తున్నా. వంట చేసి టేబుల్ మీద పెట్టా తినండి. నా భోజనం అక్కడే" చెప్పింది కనకదుర్గ.

"ఆదివారాలు కూడా ఇంట్లో ఉండకపోతే ఎలా కనకా? ఇవాళైనా ఇద్దరం సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తినచ్చుగా?"

"వీక్ డేస్ అంతా మీరు బయటకి వెళ్తుంటే, మేం ఒంటరిగా తినడం లేదూ!"

"వితండ వాదం చేస్తావేంటీ? నేను సంపాదించడానికి వెళ్తున్నాను. బలాదూర్ తిరగడానికి కాదు" విసుక్కున్నాడు సీతాపతి.

"నేను కూడా సంపాదించడానికే. పుణ్యం" చిన్నగా నవ్వి తలుపు దగ్గరకి వేసి వెళ్ళిపోయింది కనకదుర్గ.

తీరికగా స్నానం చేసి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు. గిన్నెల మీది మూతలు తీసి చూసిన సీతాపతికి ఏడుపు వచ్చింది. అరటికాయ వేపుడు, చారు. అంతే. ఆ రెండూ సీతాపతికి అతి అయిష్టమైన పదార్థాలు. ఆవకాయ, పెరుగుతో భోజనం ముగించాడు.

"నాన్నా ఎలా ఉన్నావు? అమ్మెక్కడ?" ఢిల్లీ నుంచి కూతురు ఫోన్ చేసింది.

"ఎక్కడికో పూజకి వెళ్ళింది బేబీ. మీ అమ్మకి ఈ మధ్య భక్తి పిచ్చెక్కింది. పూజలు, పునస్కారాలు. గంటలకి గంటలు ఇంట్లో చేయడమే కాక, అందరిళ్ళకీ వెళ్ళిపోతోంది. నీకు తెలుసుగా నేనేమో మెతక మనిషిని. ఏమీ అనలేను. ఇవాళ ఆదివారం అంతా స్పెషల్స్ తింటుంటే నేను ఆవకాయ అన్నం తిన్నాను.." కూతురికి కష్టాలన్నీ ఏకరువు పెట్టాడు సీతాపతి.

"అంతా నీ మూలంగానే నాన్నా" అన్నీ విన్న కూతురు తీర్పునిచ్చింది.

"నా మూలంగానా? నేనేం చేసాను?" సీతాపతి బిత్తరపోయాడు.

"మరి? ఈ పూజల్లాంటివాటిని మొదట్లోనే తుంచేయాలి. సిగరెట్‌లా అదో వ్యసనం. లేదా ఇంట్లోనే చేసుకో బయటకి వెళ్ళకు అనైనా చెప్పాలి. నువ్వు మరీ మంచివాడివి నాన్నా! ఐ.పిటీయూ. అమ్మకి నేను చెపుతాలే." ఊరడించింది.

ఏం తోచక మేట్నీకి వెళ్ళి జంటలుగా వచ్చిన వాళ్ళని చూసి కుళ్ళుకుని సాయంత్రానికి ఇంటికి చేరాడు సీతాపతి. వంపు సొంపులతో అలరించిన హీరోయిన్‌ని తలచుకుంటూ బెల్ నొక్కి తలుపు తీసిన కనకదుర్గని చూసి దడుసుకున్నాడు.

చెంపలకి పసుపు, నుదురంతా కుంకుమ. చెమటకి కొంత ముక్కుమీదకి కారింది. గొంతుకి దట్టంగా పూసిన గంధం. జాతరలో అమ్మవారులా ఉంది కనకదుర్గ.

"ఎంతకాలానికి సార్థకనామధేయురాలిలా ఉన్నావు కనకా!" వీపు చరచుకుంటూ చెప్పాడు.

"చాల్లెండి. ఎక్కడికి వెళ్ళారు? అన్నం సరిగ్గా తినలేదే?" పరామర్శించింది కనకదుర్గ.

"నేనా అరటికాయ, చారు తిననని తెలిసీ అవే ఎందుకు చేసినట్లు?" నిగ్గదీసాడు సీతాపతి.

"తొందరగా చేయచ్చని" నవ్వింది.

"నీకింకా నిండా ఏభై లేవు. అప్పుడే ఈ భక్తి పిచ్చేమిటి? దానికి చాలా టైం ఉంది. రాత్రికైనా మంచి వంట చేసి, శుభ్రంగా స్నానం చేసి ఈ అవతారాన్ని చాలించు కనకా" నచ్చ చెప్పాడు సీతాపతి.

"సహస్రనామాలు చదివీ చదివీ నోరు నొప్పి. అంతసేపు కూర్చుని నడుం నొప్పి. ఇవాళ నావల్లకాదు." ఖచ్చితంగా చెప్పింది కనకదుర్గ.

పళ్ళు పటపట కొరికాడు సీతాపతి.

"నాకు పుణ్యమంతా వచ్చేస్తోందని మీకు కుళ్ళు. అమ్మాయికి నామీద అభాండాలు చెప్తారా?" గుమ్మంలోనే నిలదీసింది కనకదుర్గ.

"అభాండమా? ఒక్క అబద్దం కూడా చెప్పలేదు తెలుసా? కూతురని కొన్ని విషయాలు చెప్పలేదు కూడా."

"అబ్బో! ఇంకా చెప్పాల్సినవి కూడా ఉన్నాయా?" దీర్ఘం తీసింది.

"అవును. నువ్వు నెలలో ఇరవైరోజులు అలసిపోయి ఆపసోపాలు పడుతుంటావు. మనిద్దరం బెడ్‌రూంలో హాయిగా గడిపి ఎంత కాలమైందో నువ్వే చెప్పు. ఐనా నా భార్యవై ఉండి, వచ్చే జన్మలో మంచి మొగుడు రావాలని ఈ పూజలేంటే నా ఖర్మ." వాపోయాడు సీతాపతి.

"వచ్చే జన్మలోకూడా మీరే కావాలని కానీ మీరిలా గుమస్తా కాకుండా మహారాజు కావాలని ఈ పూజలు." కొంటెగా నవ్వింది కనకదుర్గ.

ఏమనాలో తెలీక ఉరిమి చూసాడు సీతాపతి.

"రేపు నేను విజయవాడ వెళ్తున్నాను" ఆ రాత్రి భోజనాల దగ్గర చెప్పింది కనకదుర్గ.

"ఎందుకు? మనకి అక్కడ ఎవరూ లేరే?"

"అయ్యో కనకదుర్గమ్మ ఉంది కదండీ?"

"ఆవిడెవరు? మీ అమ్మమ్మా?" అమాయకంగా అడిగాడు సీతాపతి.

"మీరింత మొద్దు అనుకోలేదు. హుం! అమ్మవారండి కనకదుర్గమ్మ. ఆవిడ పేరు పెట్టుకున్నా కూడా ఇంతదాకా దర్శనం చేసుకోలేదు. మా గ్రూప్ వాళ్ళతో రేపు విజయవాడ వెళ్ళి అమ్మవారి సమక్షంలో లలితా సహస్రనామాలు పారాయణ చేసి మూడురోజుల్లో వస్తా"

"పర్మిషనా? ఇన్ఫర్మేషనా?"

"ఇన్ఫర్మేషనే. మీ పర్మిషనేమిటి నా తలకాయ్. నేనేం చెప్పినా మీరు తలాడిస్తారుగా ఎటూ" కొంటెగా చెప్పింది కనకదుర్గ.

"గ్రూప్ ఏమిటి?" అనుమానంగా అడిగాడు సీతాపతి.

"మ పారాయణ గ్రూప్. రామలక్ష్మిగారు మా గురువుగారు. మేమంతా శిష్యులం." గర్వంగా చెప్పింది.

"నీ పిచ్చి పరాకాష్టకి చేరుకుంది." కోపంగా చెప్పాడు సీతాపతి.

"సరే పడుకోండి. పొద్దున్నే ఇంటర్ సిటీకి వెళ్ళాలి. తొందరగా లేవాలి."

సంభాషణకి ఫుల్‌స్టాప్ పెట్టింది కనకదుర్గ.

విజయవాడ నుంచి పుట్టెడు జ్వరంతో వచ్చి వారం రోజులు మంచమెక్కింది కనకదుర్గ.

"మీ అమ్మవారికి కోపం తెప్పించావు కనకా. సీతాపతిని ఏడిపించద్దు అని వార్నింగ్ ఇచ్చింది."

"మీకు హాస్యాలు కూడా వచ్చే!" నవ్వింది కనకదుర్గ.

"నువ్వు లేకపోతే అసలు తోచలేదు కనకా. నాకు వంటరాదు. బయట ఆ మసాలాలు తినలేను. ఇంట్లో నువ్వు లేకపోతే అసలు ఇంటికే రాబుద్ధికాలేదు" గోముగా చెప్పాడు సీతాపతి.

"అయ్యో! వచ్చేవారం మేం కాశీ వెళ్తున్నామే?" సానుభూతిగా చెప్పింది కనకదుర్గ.

"కాశీనా?" అదిరి పడ్డాడు సీతాపతి.

"అవును. రిజర్వేషన్ కూడా అయిపోయింది. అన్నపూర్ణమ్మ దగ్గర పారాయణ చేయాలని గురువుగారి కోరిక. " తన్మయత్వంగా చెప్పింది.

జుట్టుపీక్కున్నాడు సీతాపతి.

కాశీనుంచి ప్రయాగ, త్రివేణీ సంగమం అన్నీ సందర్శించి పారాయణ చేసి పదిరోజుల తర్వాత తిరిగి వచ్చిన కనకదుర్గ తలుపు తీసిన సీతాపతిని చూసి కెవ్వుమంది.

"ఏమిటిలా అయిపోయారు? మీ జుట్టేది? మొహమంతా నల్లగా అయిపోయిందేంటి? చొక్కా ఏమిటి అలా జారిపోతోంది?" కంగారుగా అడిగింది.

"కనకా వచ్చావా?" కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు సీతాపతి.

"రాక ఎక్కడికి పోతాను? చెప్పండి ఏమిటిలా అయిపోయారు?"

"నువ్వు గుర్తొచ్చినప్పుడల్లా జుట్టు పీక్కున్నాను. కూరల్లో తిరగమోత వేసినప్పుడు ఆవిరి కొట్టి మొహం నల్లబడింది. తిండి సరిగ్గా లేక చిక్కిపోయి చొక్కా జారిపోయింది" విద్యార్థిలా టకటక జవాబు చెప్పాడు సీతాపతి.

"పదిరోజులు పెళ్ళాం ఊరెళితే ఈ మాత్రం సమర్ధించుకోకపోతే ఎట్లాగండీ?" విసుక్కుంది కనకదుర్గ.

"నీ భక్తి రాష్ట్రవ్యాప్తం, దేశవ్యాప్తం అయిపోయింది. మళ్ళీ ఏ ఊరికి ప్రయాణం పెడతావో అని భయంగా ఉంది కనకా. ఐనా మీ గురువుగారి భర్తగారు ఏమీ అనడా అలా దేశాలు పట్టుకుపోతే?"

"ఆయన ఏమీ అనరట. ఇంట్లో వంటమనిషి ఉంది ఇంక బాధేంటి?"

"వంట మనిషి ఉందా? వయసెంతో?" ఆరా తీసాడు.

"ముప్పై ఏళ్ళుండచ్చు. మొగుడు వదిలేసాట్ట."

"కనకా..కనకా ప్లీజ్. ఆ వంట మనిషిని మనకి మాట్లాడతావా?" ఆశగా అడిగాడు.

"చంపుతా" గద్దించింది కనకదుర్గ.

"కనకా.. పారాయణం ఎలా చేస్తారు?" అడిగాడు సీతాపతి.

"అమ్మవారి ముందు పసుపు, కుంకుమ రాశులు పోసి అమ్మవారికి పూజ చేస్తూ నామాలు చదువుతాం" పారవశ్యంగా చెప్పింది.

"అంటే నీ మొహాన బొట్టు ఉంటేనే అందుకు నీకు అర్హత ఉంటుందన్నమాట"

"అవును. అయితే?"

"నువ్విలా పూజలకి తిరిగితే తిండిలేక చచ్చిపోతాను కనకా, అప్పుడు నువ్వు కుంకం పూజకి పనికిరావేమో ఆలోచించు. ఇక నావల్లకాదు" ఖండితంగా చెప్పాడు సీతాపతి.

ఆలోచనలో పడింది కనకదుర్గ.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story